


ప్రభుత్వ కళాశాలలో చేరండి

ముస్తాబాద్: ప్రభుత్వ జూనియర్ కాలేజీలో చేరి ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలు పొందాలని ముస్తాబాద్ కళాశాల అధ్యాపకులు శుక్రవారం విద్యార్థుల తల్లిదండ్రులను కలిశారు.



అంజన్న ఆదాయం రూ.2లక్షలు

వేములవాడఅర్బన్: అగ్రహారం శ్రీహనుమాన్ హుండీ ఆదాయం రూ.2,03,292 వచ్చినట్లు ఈవో నాగారపు శ్రీనివాస్ తెలిపారు.



	ఇఫ్తార్ శనివారం (సా॥)	సహర్ ఆదివారం (ఉ॥)
కరీంనగర్ :	6.30	4.53
పెద్దపల్లి :	6.34	4.51
సిరిసిల్ల :	6.29	5.01
జగిత్యాల :	6.34	4.51

న్యూస్‌రీల్

రాయితీపై వ్యవసాయ పనిముట్లు అందించాలి

• మంత్రి తుమ్మలను కలిసిన కవ్వంపల్లి



మంత్రి తుమ్మలను కలిసిన ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

ఇల్లంతకుంట(మానకొండూర్): రాయితీపై వ్యవసాయ పనిముట్లు రైతులకు అందించాలని మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కోరారు. శుక్రవారం సచివాలయంలో కలిసి ఈమేరకు విన్నవించారు. మానకొండూరు నియోజకవర్గంలోని సాగునీటి సమస్య గల మండలాలకు డ్రిప్ ఇరిగేషన్ ద్వారా సేద్యం చేసుకొనుటకు కావలసిన వ్యవసాయ పరికరాలు రాయితీపై అందించాలని కోరారు.

వివరాల నమోదుకు సహకరించాలి

• ఏడీఏ రత్నాకర్



మాట్లాడుతున్న సహాయ సంచాలకులు రత్నాకర్

ముస్తాబాద్(సిరిసిల్ల): వివరాల నమోదుకు చేపట్టిన డిజిటలైజేషన్‌కు రైతులు సహకరించాలని వ్యవసాయ సహాయ సంచాలకుడు రత్నాకర్ కోరారు. ముస్తాబాద్ మండలం చీకోడు, మోహినికుంటల్లో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన రైతు నమోదుపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఏడీఏ మాట్లాడుతూ రైతులు తమ పట్టాదారు పాస్‌బుక్కుల తోపాటు ఆధార్ ద్వారా డిజిటలైజేషన్ కార్యక్రమాన్ని దేశవ్యాప్తంగా కేంద్రం చేపట్టిందని తెలిపారు. దీని ద్వారా రైతులకు ప్రత్యేక గుర్తింపుకార్డును ఇవ్వనున్నట్లు తెలిపారు. రైతుభరోసా, రుణమాఫీకి దీనికి సంబంధం లేదని స్పష్టం చేశారు. రైతు విశిష్ట సంఖ్యను పొందుటకు ఆధార్, పాస్‌బుక్కు, ఫోన్‌నంబర్‌లను సమీపంలోని వ్యవసాయ అధికారులకు అందజేసి నమోదు చేసుకోవాలని కోరారు. మండల వ్యవసాయాధికారి దుర్గరాజు, ఇతర అధికారులు రెబల్సన్, చిరంజీవి, నరేశ్ పాల్గొన్నారు.

కరెంట్ కనెక్షన్‌లు తొలగించొద్దు



సెస్ ఏఈ రమేశ్‌కు వినతిపత్రం ఇస్తున్న అడవిపదిర గ్రామస్తులు

వీర్నపల్లి(సిరిసిల్ల): అధిక బకాయిలు ఉన్నాయనే కారణంతో కరెంట్ కనెక్షన్‌లు తొలగించొద్దని కోరుతూ వీర్నపల్లి మండలంలోని అడవిపదిర గ్రామస్తులు శుక్రవారం సెస్ ఆఫీస్ ఎదుట ఆందోళనకు దిగారు. వారు మాట్లాడుతూ గతంలో పనిచేసిన సెస్ అధికారి నిర్లక్ష్యంతోనే గ్రామంలో విద్యుత్ బకాయిలు పేరుకుపోయాయని, ఇప్పుడు వాటిని చెల్లించాలంటూ కరెంట్ కనెక్షన్‌లు తొలగించడం సరికాదన్నారు. అనంతరం సెస్ ఏఈ రమేశ్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రజాసంఘాల నాయకులు మల్లారపు అరుణ్‌కుమార్, జాలపెల్లి మనోజ్‌కుమార్, గ్రామస్తులు రాజవ్వ, పద్మ, దేవవ్వ, పూర్ణిమ, వనిత, ఎల్లవ్వ, పుష్ప, మంజుల, రాజవ్వ, ప్రకాశ్, క్రాంతి, జాషువా, కార్తీక్, మనోభి షేక్, విష్ణు రాబిన్‌సన్ పాల్గొన్నారు.

డాక్టర్ పోస్టుల ఖాళీల భర్తీ

సిరిసిల్ల: జిల్లాలోని వేములవాడ ప్రాంతీయ ఆస్పత్రి, గంభీరావుపేట కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో ఖాళీగా ఉన్న వైద్య పోస్టులను కాంట్రాక్ట్ విధానంలో భర్తీ చేస్తామని జిల్లా వైద్య విధాన పరిషత్ కో–ఆర్డినేటర్ డాక్టర్ పి.పెంచలయ్య శుక్రవారం ప్రకటనలో తెలిపారు. వేములవాడ ప్రాంతీయ వైద్యశాలలో ఖాళీగా ఉన్న రెండు గైనకాలజిస్ట్, మూడు డ్యూటీ డాక్టర్ పోస్టులు, గంభీరావుపేట సీహెచ్‌సీలో జనరల్ ఫిజీషియన్ లేదా పిల్లల వైద్య నిపుణుల పోస్టులను భర్తీ చేస్తామని పేర్కొన్నారు. వేతనం నెలకు స్పెషలిస్ట్ డాక్టర్‌కు రూ.లక్ష, జనరల్ డాక్టర్లకు రూ.52,351 చెల్లిస్తారని వివరించారు. ఆసక్తి గల వారు సర్టిఫికెట్లతో ఏప్రిల్ 2న కలెక్టరేట్‌లో ఇంటర్వ్యూలకు హాజరుకావాలని తెలిపారు.

ప్రేమ.. పరువు.. ఆత్మహత్య.. హత్య!

- దారుణాలకు దారితీస్తున్న కులాంతర ప్రేమలు
- కలకలం రేపుతున్న ప్రేమికుల హత్యలు, ఆత్మహత్యలు
- తాజాగా సాయికుమార్‌ను వెంటాడి నరికి చంపిన వైనం
- ఉమ్మడి జిల్లాలో పెరుగుతున్న ఉత్తరాది కల్చర్
- మరోసారి పరువు హత్యలపై జోరుగా చర్చ



సాక్షిప్రతినిధి, కరీంనగర్:

ప్రేమ.. త్యాగం నేర్పుతుంది అంటారు. కానీ.. యువతీ, యువకుల మధ్య చిగురించిన ప్రేమ బలికోరుతోంది. సామాజిక సమీకరణాలు కుదరక కులాల కుంపటి రాజుకుంటోంది. గ్రామాల్లో ఈ పోకడ పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. తాము కనీ, పెంచిన పిల్లలు తమకు దక్కకుండా పోతారన్న భయం, పరువు పోతుందన్న ఆందోళనలో తల్లిదండ్రులు తీవ్ర నిర్ణయాలు తీసుకుంటున్నారు. ఇవి హత్యల వరకు దారితీస్తున్నాయి. మరోపక్క తమ ప్రేమను తల్లిదండ్రులు అంగీకరించన్న భయంతో ప్రేమికులు ప్రాణత్యాగాలు చేసుకుంటున్నారు. దురదృష్టవశాత్తూ ఉమ్మడి జిల్లాలో ఇలాంటి ఘటనలు పునరావృతం అవుతుండగా.. సామాజిక అంతరాలకు అద్దం పడుతున్నా యి. వేర్వేరు కులాల యువతీ, యువకులు ప్రేమించుకుంటే వారిపై దాడులు సహజమే అయినా.. అది చంపుకునేదాకా వెళ్తుండడమే ఆందోళన కలిగిస్తోంది. ఒకప్పుడు ఉత్తరాదికే పరిమితమైన ఈ పోకడ ఉమ్మడిజిల్లాకు పాకడం గమనార్హం.

పంతాలతో కుటుంబాలు నాశనం

సామాజిక కట్టుబాట్లను ఛేదించలేక, అల్లారుముద్దుగా పెంచుకున్న పిల్లల ప్రేమను అంగీకరించలేక పెద్దలు తీసుకుంటున్న తీవ్ర నిర్ణయాలు ఆయా కుటుంబాలను రోడ్డున పడేస్తున్నాయి. కుటుంబ పెద్ద జైలుకు వెళ్లడంతో ఆర్థికంగా చితికిపోతున్నాయి. వాస్తవానికి ఏ సమాజంలో ఏ పరువు కోసం హత్యలు చేస్తున్నారో.. తరువాత అదే సమాజం ఆయా కుటుంబాలకు అండగా నిలబడని విషయాన్ని తల్లిదండ్రులు గుర్తించాల్సిన అవసరం ఉంది. అదే సమయంలో యుక్తవయసులో ప్రేమే సర్వస్వం అంటూ జీవితంలో స్థిరపడక ముందే ప్రేమ వ్యవహారాల్లో చిక్కుకొని ప్రాణాలు తీసుకుని, తల్లిదండ్రులకు గర్భశోకాన్ని మిగుల్చుతున్నారు.

ఉమ్మడి జిల్లాలోని పలు ఘటనలు

- మార్చి 27న పెద్దపల్లి జిల్లా ఎలిగేడు మండలం ముప్పిరితోటకు చెందిన సాయికుమార్‌ను అదే గ్రామానికి చెందిన ముత్యం సదయ్య తన కుమార్తెను ప్రేమిస్తున్నాడని గొడ్డలితో నరికి చంపడం రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపుతోంది. కేవలం కులాలు వేరన్న కారణమే సాయిని చంపేలా చేసింది.
- ఇల్లందకుంట యువకుడు, నిర్మల్ జిల్లాకు చెందిన యువతి ప్రేమించుకున్నారు. పెద్దల ఆమోదం ఉండదన్న ఆందోళనతో మార్చి 17న జమ్మికుంట పరిధిలోని రైల్వేస్టేషన్‌లో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నారు.
- మార్చి 6న చొప్పదండికి చెందిన ప్రేమికులు ఇంట్లోవారు తమ ప్రేమను అంగీకరించరన్న భయంతో కరీంనగర్‌లో స్నేహితుడి ఇంట్లో ఉరేసుకుని ప్రాణాలు తీసుకున్నారు.
- 2024 ఏప్రిల్‌లో తాను అల్లారుముద్దుగా పెంచుకున్న కూతురు కులాంతర వివాహం చేసుకుని వెళ్లిపోయిందన్న బాధతో సిరిసిల్ల జిల్లాలో ఓ తండ్రి తన కుమార్తెకు పిండ ప్రదానం చేశాడు. తమ ఆశలను అడియాశలు చేసిన కూతురు మరణించిందని ఫ్లెక్సీ పెట్టించడం సంచలనంగా మారింది.
- 2023 నవంబరులో సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలానికి చెందిన ప్రేమికులు విషం తాగి ప్రాణాలు తీసుకున్నారు.
- 2023 ఆగస్టులో కోరుట్ల పట్టణంలో తన ప్రియుడితో పరారయ్యే క్రమంలో ప్రియురాలు తన అక్కనే హత్య చేసి పరారవడం కలకలం రేపింది.
- 2021 ఆగస్టులో మంథనికి చెందిన ఓ ప్రేమ జంటపై యువతి తండ్రి హేయంగా దాడి చేశాడు. ఈ దాడిలో ప్రేమికులు తృటిలో చావు నుంచి తప్పించుకున్నారు.
- 2017లో మంథనిలో మధుకర్ అనే దళిత యువకుడి అనుమానాస్పద మరణం కూడా పరువుహత్యగా ప్రాచుర్యం పొందింది. అనుమానాస్పద మరణం అని పోలీసులు, ప్రియురాలి బంధువులే చంపారని మధుకర్ కుటుంబ సభ్యులు ఆరోపించారు. దళితసంఘాలు ధర్నా చేయడంతో మృతదేహానికి రీపోస్టుమార్టం నిర్వహించారు. అప్పట్లో ఇది జాతీయస్థాయిలో చర్చనీయాంశంగా మారింది. ఈ కేసు ఇంకా తేలాల్సి ఉంది.
- 2016లో తిమ్మాపూర్‌లోని ఓ గుడిలో ప్రేమ వివాహం చేసుకునేందుకు పీటల మీద కూర్చున్న జంటపై యువతి బంధువులు దాడి చేశారు. పెళ్లికూతురు కళ్లముందే పెళ్లికొడుకును విచక్షణా రహితంగా పొడిచి చంపడం కలకలం రేపింది.

ఆలోచన తీరు మారాలి



కులం అహంకారంతో జరిగే దారుణాలతో ప్రాణాలుపోతున్నాయి. టెక్నాలజీలో ముందున్న మనం ఆధునికంగా ఆలోచించలేక పోతున్నాం. ఉన్నత చదువులు చదువుకునే..యువత కూడా ప్రేమించుకోవడం.. కాదన్నారని ప్రాణాలు తీసుకోవడం తగదు. ఈ ఘటనలకు కేవలం ఆలోచన తీరే కారణం. తీరుమారితే విపరీత ధోరణులు మారుతాయి.

– ప్రొఫెసర్ సూరేపల్లి సుజాత, సోషియాలజీ విభాగం అధిపతి, శాతవాహన వర్సిటీ

కుల వివక్షపై అవగాహన కల్పించాలి



సమాజంలో అనేక మార్పులు చోటు చేసుకుంటున్నా కుల, మత భేదాలు గ్రామాల్లో అలాగే కొనసాగుతున్నాయి. కులాల మధ్య వైరుధ్యాలు పెరిగేలా ప్రభుత్వాలు కులాల ఆధారంగా ప్రవేశపెడుతున్న పథకాలు ప్రజల మధ్య దూరాలను పెంచుతున్నాయి. పిల్లల ప్రేమ కన్నా పరువు, పట్టింపులే ఎక్కువ అనే భావన తొలిగేలా, కులవివక్షపై ప్రజలకు అవగాహన కలిగించేలా ప్రభుత్వం కార్యక్రమాలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

– కల్లెపల్లి అశోక్, కేవీపీఎస్

పౌరహక్కులను కాపాడుకోవాలి

• కాంగ్రెస్ రాష్ట్ర కోఆర్డినేటర్ అవీజ్



మాట్లాడుతున్న అవీజ్

సిరిసిల్ల/కోనరావుపేట/గంభీరావుపేట: కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగంలోని హక్కులను కాలరాసేలా వ్యవహరిస్తోందని, పౌరుల హక్కులు కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని కాంగ్రెస్ రాష్ట్ర కోఆర్డినేటర్ అవీజ్ కోరారు. కోనరావుపేట, గంభీరావుపేట మండల కేంద్రాల్లో శుక్రవారం జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణగౌడ్, పార్టీ మండలాల అధ్యక్షుడు షేక్ ఫిరోజ్‌పాషా, హమీద్, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు కేతిరెడ్డి జగన్మోహన్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్‌లు కచ్చకాయల ఎల్లయ్య, కొమిరిశెట్టి విజయ, వైస్ చైర్మన్‌లు తాళ్లపెల్లి ప్రభాకర్, అంజిరెడ్డి, మండల కో–ఆర్డినేటర్ వెంకటస్వామి, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ప్రజలకు వివరించాలి

కాంగ్రెస్ పార్టీ శ్రేణులు క్షేత్రస్థాయిలో పాదయాత్రలు చేస్తూ 'జై బాపూ.. జైభీమ్.. జై సంవిధాన్' లక్ష్యం నెరవేర్చాలని ఏఐసీసీ కోఆర్డినేటర్ అవీజ్ కోరారు. సిరిసిల్లలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగానికి తూట్లు పొడిచే ప్రయత్నం చేస్తుందని, వారి చర్యలను ప్రజలకు వివరించాలన్నారు. 18 నెలల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను వివరించాలని కోరారు. బీఆర్ఎస్, బీజేపీలు సోషల్ మీడియా వేదికగా కాంగ్రెస్‌పై తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. జిల్లా గ్రంథాలయసంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణగౌడ్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాశ్, నాయకులు ఆకునూరి బాలరాజు, గడ్డం నర్సయ్య, సూర దేవరాజు, ఆడెపు చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

ఆడిటింగ్‌కు సిద్ధంగా ఉండాలి

• ఐకేపీ డీపీఎం పద్మయ్య



మాట్లాడుతున్న డీపీఎం పద్మయ్య

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఈనెలతో ఆర్థిక సంవత్సరం ముగుస్తుండడంతో జిల్లాలోని అన్ని గ్రామాల సంఘాల పుస్తకాలు రాసి ఆడిటింగ్‌కు సిద్ధంగా ఉండాలని ఐకేపీ డీపీఎం పద్మయ్య సూచించారు. మండల కేంద్రంలోని కావేరి మండల సమాఖ్య కార్యాలయంలో శుక్రవారం వీఏవోలతో సమావేశమయ్యారు. ముఖ్య అతిథిగా హాజరైన పద్మయ్య మాట్లాడుతూ.. ప్రతీ గ్రామంలో ఆర్థిక లావాదేవీలపై మహాసభలు ఏర్పాటు చేయాలన్నారు. మానవ అక్రమ రవాణా, లైంగిక వ్యాపారంపై మహిళలను అప్రమత్తం చేయాలని సూచించారు. ప్రభుత్వం ఇస్తున్న వడ్డీలేని రుణాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఏపీఎం మల్లేశం, మండల సమాఖ్య అధ్యక్షురాలు బైరి జ్యోతి, కార్యదర్శి మీన, కోశాధికారి రమ, సీసీలు మంగ్యానాయక్, దేవేందర్, నాగరాజు, సుధాకర్, రమణ, పద్మ పాల్గొన్నారు.

నిర్మానుష్యం



ఎండలు దంచికొడుతున్నాయి. మార్చిలోనే మాడు పగిలేలా ఉష్ణోగ్రతలు నమోదవుతుండడంతో జనం బయటకు రావడం లేదు. సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని రోడ్లు శుక్రవారం మధ్యాహ్నం నిర్మానుష్యంగా మారాయి. ఎప్పుడూ రద్దీగా కనిపించే కొత్తబస్టాండ్, పాతబస్టాండ్, అంబేడ్కర్ సర్కిల్ జనం లేక వెలవెలబోయాయి. శుక్రవారం సిరిసిల్లలో గరిష్టంగా 39.5 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. – సాక్షి ఫొటోగ్రాఫర్, రాజన్నసిరిసిల్ల

ప్రజలతో సంబంధాలు మెరుగుపర్చుకోవాలి

- పాత నేరస్తుల కదలికలపై నిఘా పెంచాలి
- ఎస్పీ మహేశ్ బీ.గీతే

చందుర్తి(వేములవాడ): ప్రజలతో సంబంధాలు మెరుగుపర్చుకోవాలని ఎస్పీ మహేశ్ బీ.గీతే సూచించారు. చందుర్తి సర్కిల్ కార్యాలయంతోపాటు ఠాణాను శుక్రవారం సందర్శించారు. సిబ్బంది పనితీరు, సర్కిల్ పరిధిలో కేసుల వివరాలు, పెండింగ్ కేసుల వివరాలు తెలుసుకున్నారు. ఎస్పీ మహేశ్ బీ.గీతే మాట్లాడుతూ ఫిర్యాదులపై వెంటనే స్పందించాలని సూచించారు. వీపీవోలు తరచూ గ్రామాల్లో పర్యటిస్తూ.. గ్రామీణులను అప్రమత్తం చేయాలన్నారు. అక్రమ బెట్టింగ్‌లు, గేమింగ్ యాప్‌లతో కలిగే అనర్థాలను ప్రజలకు వివరించాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠినంగా వ్యవహరించాలన్నారు. పాత నేరస్తుల కదలికలపై నిఘా ఉంచాలన్నారు. అనంతరం మండలంలోని లింగంపేటలోని పోలీస్ అమరవీరుల స్తూపాన్ని సందర్శించారు. చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సైలు అంజయ్య, అశోక్ ఉన్నారు.



చందుర్తి పోలీస్‌స్టేషన్ పరిస్థితిపై ఎస్సైని అడుగుతున్న ఎస్పీ మహేశ్ బీ.గీతే

విజిబుల్ పోలీసింగ్‌పై దృష్టి పెట్టాలి

రుద్రంగి(వేములవాడ): విజిబుల్ పోలీసింగ్‌పై దృష్టి పెట్టాలని ఎస్పీ మహేశ్ బీ.గీతే సూచించారు. రుద్రంగి ఠాణాను సందర్శించిన సందర్భంగా సిబ్బందితో మాట్లాడారు. ఠాణాలో నమోదవుతున్న కేసుల వివరాలు, పెండింగ్ కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా అధికారులు, విలేజ్ పోలీస్ అధికారులు తరచూ గ్రామాల్లో పర్యటించాలని సూచించారు. ప్రజలకు సైబర్ నేరాలు, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించాలన్నారు. స్టేషన్ పరిధిలో నిత్యం డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలు చేపట్టాలని సూచించారు.

లింగనిర్ధారణ తీవ్ర నేరం

• జిల్లా వైద్యాధికారి ఎస్.రజిత

సిరిసిల్ల: గర్భిణులకు స్కానింగ్ చేసి గర్భంలోని బిడ్డ లింగ నిర్ధారణ చేయడం తీవ్రమైన నేరమని జిల్లా వైద్యాధికారి ఎస్.రజిత హెచ్చరించారు. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ ఆఫీస్‌లో శుక్రవారం పీసీపీఎన్‌డీటీ సలహా కమిటీ సమావేశం జరిగింది. జిల్లా వైద్యాధికారి రజిత మాట్లాడుతూ స్కానింగ్ సెంటర్‌లలో ఫామ్ ఆడిట్లను ప్రతీనెల ప్రోగ్రాం ఆఫీసర్ తనిఖీ చేస్తారని, ధరల పట్టిక, ఇతర సర్టిఫికెట్లను గోడలపై ప్రదర్శించాలని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లో లింగ నిర్ధారణ చేయరాదని, అబార్షన్లు చేయవద్దన్నారు. ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ అంజలినా ఆల్ఫ్రెడ్, గైనకాలజిస్ట్ డాక్టర్ శోభారాణి, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ అనిత, లీగల్ అడ్వయిజర్ శాంతిప్రకాశ్ శుక్లా, మానేరు స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి డాక్టర్ చింతోజు భాస్కర్, డిప్యూటీ డెమో రాజ్‌కుమార్, హెచ్‌ఈ బాలయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి రజిత

యువ విలాపం

- రేషన్‌కార్డు నిబంధనతో అనర్హత
- దరఖాస్తులోనే చుక్కెదురు
- అందని ప్రభుత్వ స్వయం ఉపాధి పథకాలు
- రేషన్‌కార్డు అర్హత తొలగించాలని డిమాండ్



వీరు ముస్తాబాద్ మండలం తెర్లుమద్దికి చెందిన దంపతులు బెదుర రమేశ్, లాస్య. బీఎస్సీ కంప్యూటర్ చదువుకున్న రమేశ్ ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. భార్య లాస్య డిగ్రీ చదివింది. రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పథకం ప్రకటించడంతో రమేశ్ దంపతులు స్వయం ఉపాధి పొందవచ్చని భావించారు. ముస్తాబాద్‌లో కర్రీ పాయింట్ పెట్టుకుందామని దరఖాస్తు చేసుకునేందుకు మీసేవ కేంద్రానికి వెళ్లారు. రమేశ్‌కు రేషన్‌కార్డు లేకపోవడంతో, ఆయన దరఖాస్తును ఆన్‌లైన్‌లో స్వీకరించలేదు. తల్లిదండ్రుల పేరుతో ఉన్న కార్డులో రమేశ్ పేరు లేకపోవడం, ఇటీవల భార్య పేరుతో సహా తన పేరుతో కొత్త రేషన్‌కార్డు కోసం చేసిన దరఖాస్తుకు మోక్షం లభించలేదు. దీంతో రేషన్‌కార్డు లేక, రమేశ్ రాజీవ్ యువ వికాసానికి అర్హత కోల్పోయాడు. ఇలాంటి పరిస్థితి జిల్లా వ్యాప్తంగా చాలా మంది యువకులు ఎదుర్కొంటున్నారు.



సర్టిఫికెట్ల కోసం తహసీల్దార్ కార్యాలయానికి వచ్చిన దరఖాస్తుదారులు

ముస్తాబాద్(సిరిసిల్ల): ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాజీవ్ యువవికాసంతో స్వయం ఉపాధి పొందాలనుకున్న నిరుద్యోగ యువతకు నిబంధనలు అడ్డంకిగా మారాయి. ఉన్నత విద్య అభ్యసించి ఉద్యోగాలు రాని చాలా మంది యువత ఈ పథకంతో స్వయ ఉపాధి యూనిట్లు ఏర్పాటు చేసుకుందామని ఆశపడితే ఆ స్కీమ్ నిబంధనలతో దరఖాస్తు చేసుకోలేక పోతున్నారు. రేషన్‌కార్డు నిబంధన తొలి అవరోధంగా మారింది. ఏప్రిల్ 4వ తేదీతో గడువు ముగియనుండడంతో చాలా మంది అర్హత కోల్పోతున్నారు. రేషన్‌కార్డు నిబంధన తొలగించాలని చాలా మంది డిమాండ్ చేస్తున్నారు.


కొత్తకార్డులకు మోక్షం ఎప్పుడో..

కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరగానే ప్రజాపాలనలో వేలాది మంది రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తు చేసి ఏడాది గడిచినా కొత్త రేషన్‌కార్డు మంజూరు చేయలేదు. గత ప్రభుత్వం సైతం పదేళ్లుగా రేషన్‌కార్డుల జారీ, ఉన్న కార్డులో పేర్ల నమోదు చేపట్టలేదు. దీంతో కొత్తగా పెళ్లయిన దంపతులకు రేషన్‌కార్డు లేకపోగా, కార్డులు ఉన్న వారికి సంతానం కలిగితే వారి పేర్లు యాడ్ కావడం లేదు. ఇక కులం, ఆదాయం సర్టిఫికెట్ల కోసం తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు.

బీసీ కార్పొరేషన్‌పైనే ఆశలు

బీసీ కార్పొరేషన్ ద్వారా రాజీవ్ యువవికాసంలో స్వయం ఉపాధి పొందాలని వేలాది మంది యువతీయువకులు ఆశ పడుతున్నారు. రూ.లక్ష నుంచి మూడు లక్షల వరకు మూడు విభాగాల్లో 80, 60 శాతం సబ్సిడీతో ప్రభుత్వం రుణాలు అందజేస్తోంది. గతంలో 2022–23లో బీసీ కార్పొరేషన్ ద్వారా ఐదు సామాజికవర్గాలకు చెందిన 1295 మందికి రూ.50వేల చొప్పున ప్రభుత్వం అందజేసింది. బీసీ కార్పొరేషన్‌కు 2018–19లో 12వేల మంది యువతీయువకులు దరఖాస్తు చేసుకున్నారు. ఇప్పుడు కూడా రాజీవ్ యువ వికాసానికి 15 వేల దరఖాస్తులు వచ్చే అవకాశం ఉందని ఆ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రభుత్వం నుంచి కూడా ఎన్ని యూనిట్లు మంజూరు చేశారనే విషయంపై స్పష్టత లేదు.

రేషన్‌కార్డు లేదని తిరస్కరించారు



ఇంటర్ చదివిన. ఉపాధి లేక దుబాయ్ వెళ్లివచ్చిన. ఏడాది క్రితం రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసినా మంజూరు కాలేదు. ఇప్పుడు రాజీవ్ యువవికాసం కోసం దరఖాస్తు చేస్తే.. రేషన్‌కార్డు లేదని తిరస్కరణకు గురైంది. రేషన్‌కార్డు అర్హత తొలగించి, మాలాంటి వారికి ఉపాధి కల్పించాలి.

– వేముల వెంకటేశ్‌గౌడ్, ఆవునూర్

నిబంధనల మేరకు మంజూరు

ప్రభుత్వ నిబంధనల మేరకు అర్హులను ఎంపిక చేస్తాం. రేషన్‌కార్డు ఉన్న వారికే రాజీవ్ యువ వికాసం వర్తిస్తుంది. రేషన్‌కార్డు లేని యువత విషయంపై స్పష్టత లేదు. ప్రభుత్వం ఏదైనా సడలింపు ఇస్తే తెలియజేస్తాం.

– రాజమనోహర్‌రావు, బీసీడీవో

క్లుప్తంగా

వృద్ధురాలిని వదిలించుకున్నారు



జాత్రాగ్రౌండ్‌లో వదిలేసిన వృద్ధురాలికి సపర్యలు చేస్తున్న మహిళ

వేములవాడ: రాజన్న ఆలయ వసతి గదులైన లక్ష్మీగణపతి కాంప్లెక్స్ ఎదురుగా 75 నుంచి 80 ఏళ్ల మధ్య వయసు గల వృద్ధురాలిని గుర్తు తెలియని వ్యక్తులు శుక్రవారం వదిలేసి వెళ్లారు. విషయం తెలుసుకున్న ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది ఓ ఆటో డ్రైవర్ సహాయంతో వృద్ధురాలికి స్నానం చేయించి సపర్యలు చేశారు. బట్టలు మార్చి ఒక నైటీని వేయించారు.

రూ.కోటి చెల్లించిన తలనీలాల కాంట్రాక్టర్

వేములవాడ: రాజన్నకు భక్తులు సమర్పించిన తలనీలాలు సేకరించేందుకు అధికారులు నిర్వహించిన రెండేళ్ల టెండర్ ఏప్రిల్ 11తో ముగియనుంది. కొంతకాలంగా డబ్బులు చెల్లించకుంటా తలనీలాలు సేకరించకుండా కాంట్రాక్టర్ చేతులెత్తేసిన విషయం పాఠకులకు తెలిసిందే. ఈక్రమంలో ఇటీవల ప్రభుత్వం నుంచి ప్రత్యేక అనుమతులు తీసుకుని దేవస్థానానికి రావాల్సిన రూ.9.50కోట్ల బకాయిల్లో రూ.2.50కోట్లు చెల్లించి అధికారులు సేకరించి పెట్టిన తలనీలాలను స్వాధీనం చేసుకున్నారు. మిగతా డబ్బులు ఒప్పందంలో భాగంగా శుక్రవారం రూ.కోటి చెల్లించినట్లు ఈవో కొప్పుల వినోద్‌రెడ్డి తెలిపారు. మిగతా రూ.6 కోట్లలో ఏప్రిల్ 10న రూ.కోటి, ఏప్రిల్ 11న రూ.కోటిన్నర చెల్లించడంతోపాటు మిగతా డబ్బులు జూన్ నుంచి డిసెంబర్ వరకు చెల్లిస్తానని ఒప్పందంలో పేర్కొన్నారు. ఏప్రిల్ 11తో తలనీలాల సేకరణకు టెండర్ ముగియనుండడంతో ఆలయ అధికారులు ఇప్పటికే మూడుసార్లు టెండర్ నిర్వహించగా, ఎవరూ హాజరు కాలేదు. తిరిగి వచ్చే నెల 4న టెండర్ నిర్వహించనున్నారు.

20 క్వింటాళ్ల పీడీఎస్ రైస్ సీజ్

సిరిసిల్లక్రైం: స్థానిక బల్యాలనగర్‌లోని ఫౌల్ట్రీ ఫాంలో అక్రమంగా నిల్వచేసిన 20 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నట్లు సీఐ కృష్ణ తెలిపారు. కోనరావుపేట మండలం బావుసాయిపేటకు చెందిన బుర్ర అంజయ్య పీడీఎస్ బియ్యాన్ని నిల్వచేసినట్లు సమాచారంతో దాడి చేశారు. బియ్యం పట్టుబడడంతో సీజ్‌చేసి నిందితుడిని రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు.

గంజాయి కేసులో ఒకరి రిమాండ్

సిరిసిల్లక్రైం: గంజాయికి అలవాటు పడిన వేములవాడ మండలం అగ్రహారం గ్రామానికి చెందిన బండి రాజేశ్, కోనరావుపేట మండలం కొలనూర్‌కు చెందిన దూగూరి సాయికృష్ణ, వేములవాడకు చెందిన ఎనగందుల పవన్‌ను రిమాండ్‌కు పంపినట్లు సీఐ కృష్ణ తెలిపారు. వీరు మరికొందరితో కలిసి గంజాయికి అలవాటుపడి సిరిసిల్లలోని కుమ్మరిగల్లీకి చెందిన ఒక వ్యక్తి నుంచి 150 గ్రాముల గంజాయిని రూ.3,750కు కొన్నారు. దీన్ని సిరిసిల్ల శివారులోని తమ్మలకుంటలోని టన్నెల్ సమీపంలోని బండకింద దాచిపెట్టారు. శుక్రవారం సిగరెట్‌లో గంజాయిని నింపుకుని తాగేందుకు ప్రయత్నిస్తుండగా దాడి చేసి పట్టుకున్నారు.

వరికి ఊస..రైతుకు బెంగ

- పంట సాగు నుంచి అన్నదాతకు కష్టాలే..
- తొలుత సాగునీరు అందక ఎండిన పంటలు
- ఇటీవల వడగండ్లతో నేలవాలిన వైనం
- నేడు ఊసతో తాలుగా మారుతున్న వరి

జిల్లాలో వరిపంట వివరాలు

పంటలు	ఎకరాలు
వరి	1,49,366
ఎండిన పంటలు	419
వడగండ్లతో నష్టం	1,875



నాంపల్లిలో ఊస వచ్చి తాలుగా మారిన పొలం

వేములవాడఅర్బన్: వరి సాగు చేసిన రైతులను ఈ సీజన్‌లో కష్టాలు వెన్నంటే ఉంటున్నాయి. తొలుత సాగునీరు అందక పంట ఎండిపోగా.. ఇటీవల వడగండ్లతో మరికొంత పంటనష్టం ఏర్పడింది. ఇప్పుడు ఊస తెగులు ఆశిస్తుండడంతో చివరి దశలో పంట తాలుగా మారుతోంది. ఊస ఆశిస్తుండడంతో సగం పంట కూడా చేతికొస్తుందో.. లేదోనని రైతులు ఆందోళన చెందుతున్నారు.

పెట్టుబడిపై భయాందోళన

జిల్లాలో రైతులు 1,49,366 ఎకరాల్లో వరిపంట సాగు చేశారు. అయితే నీరందక దాదాపు 419 ఎకరాల్లో పంట ఎండిపోయింది. కొందరు రైతులు పశువులకు మేతగా వదిలేశారు. ఈక్రమంలో వారం రోజుల క్రితం కురిసిన వడగండ్ల వానతో 1875 ఎకరాల్లో పంట నేలవాలింది. అన్ని తట్టుకొని మిగిలిన పంట చేతికొస్తుందని ఆశపడ్డ రైతులకు ఊస తెగులు భయాందోళనకు గురిచేస్తుంది. ఊస తెగులు ఆశిస్తుండడంతో వరి పంట తాలుగా మారిపోతుంది. ఎకరానికి రూ.30వేల వరకు పెట్టుబడి పెట్టామని.. ఇలా దెబ్బమీద దెబ్బ పడుతుండడంతో పెట్టుబడి కూడా వచ్చేలా లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అవగాహన కల్పించని అధికారులు

జిల్లాలోని 13 మండలాలకు వ్యవసాయాధికారులు ఉన్నారు. వీరు మండలాల్లో పర్యటించి ఏ భూమిలో ఏ పంటలు వేసుకోవాలి, ఏ సమయంలో ఏయే మందులు వేయాలని అనే విషయాలను రైతులకు వివరించాలి. కానీ ఒక్క మండలంలో కూడా వ్యవసాయాధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి రైతులకు పంటల సాగుపై సలహాలు, సూచనలు ఇవ్వడం లేదు. పంటలకు ఎలాంటి మందులు వేయాలో తెలియక నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వ్యాపారులు చెప్పిందే సలహా.. ఇచ్చిందే మందు

గతంలో వరి పంటలను పరిశీలించి ఫర్టిలైజర్ దుకాణాదారులు, కంపెనీల ఏజెంట్లు పురుగుమందులను ఇచ్చేవారు. అంతేకాకుండా ఒక రైతుపొలంలో పిచికారీ చేసి పనిచేస్తుందా.. లేదా.. అని పరిశీలించిన తర్వాత ఆ క్రిమిసంహారక మందును రైతులకు విక్రయించేవారు. కానీ నేడు ఆ పరిస్థితులు లేవు. రైతులు ఫర్టిలైజర్ షాపులకు వెళ్తే.. అక్కడి వ్యాపారి చెప్పిందే సలహా.. ఇచ్చిందే మందుగా మారింది. కొన్ని సందర్భాల్లో ఆ క్రిమిసంహారక మందులు పనిచేయక పంటనష్టం జరుగుతుంది.

పెట్టుబడి కష్టమే..



వరిపంట ఊస తిరిగి తాలుగా మారుతోంది. పెట్టుబడి రావడం కష్టంగా ఉంది. ఆరుగాలం కష్టపడి పంటలు పండిస్తే చేతికొచ్చే వరకు నమ్మకం లేదు. అధికారులు పంటలకు ఎప్పుడు ఎలాంటి మందులు పిచికారీ చేయాలో తెలపడం లేదు.

– మానుక కొమురయ్య, తిప్పాపూర్

వరిపంట ఊస తిరుగుతుంది



వరిపంటకు ఎన్ని మందులు వాడిన చేతికొచ్చే సమయంలో ఊస తిరిగి తాలుగా మారుతోంది. వరి పంటకు 10 కర్రలు ఉంటే సగం కర్రలు తాలుగా మారుతుంది. ఎలాంటి మందులో వాడాలో తెలియక ఫర్టిలైజర్ దుకాణదారులు ఇచ్చినవే వాడుతున్నాం. అవి సరిగా పనిచేయడం లేదు. అధికారులు అవగాహన కల్పిస్తే బాగుండు.

– జంగం గంగరాజు, నాంపల్లి

అవగాహన కల్పించాం



వాతావరణంలో మార్పులతో మార్చి మొదటి వారం, రెండో వారం ఉదయం, రాత్రి, చలి, మధ్యాహ్నం ఎండ ఉంటుంది. ఇలాంటి వాతావరణ పరిస్థితుల్లో పంటపై శిలీంద్రం ఉధృతి పెరిగింది. వరిపంటలో తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం.

– సాయికిరణ్, మండల వ్యవసాయాధికారి, వేములవాడ

కొదురుపాకలో దొంగతనం

- ఐదు తులాల బంగారం.. 24 తులాల వెండి చోరీ



వివరాలు తెలుసుకుంటున్న సీఐ, ఎస్సైలు

బోయినపల్లి(చొప్పదండి): అంగన్‌వాడీ కేంద్రంలో కోడిగుడ్లు తెచ్చుకోవడానికి ఇంటికి గడియపెట్టి వెళ్తే తిరిగి వచ్చే సరికి దొంగతనం జరిగింది. ఎస్సై పృథ్వీధర్‌గౌడ్ తెలిపిన వివరాలు. కొదురుపాకకు చెందిన సట్ట జలజ కోడిగుడ్ల కోసం ఇంటికి గడియ పెట్టి అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లింది. తిరిగి ఇంటికి వచ్చి చూసేసరికి ఇంట్లోని రెండు బీరువాల తలుపులు తెరిచి ఉన్నాయి. బీరువా వద్దకు వెళ్లి చూడగా అందులో ఉన్న తన అత్తమ్మ బంగారం కనిపించలేదు. గుర్తుతెలియని వ్యక్తులు సుమారు 5 తులాల 9 గ్రాముల బంగారు నగలు, 24 తులాల వెండి ఎత్తుకెళ్లారని ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. సంఘటన స్థలాన్ని వేములవాడ రూరల్ సీఐ శ్రీనివాస్ పరిశీలించారు. ఫింగర్‌ప్రింట్, డాగ్ స్క్వాడ్ బృందంతో తనిఖీలు చేపట్టారు.

పట్టుదలగా చదివితే లక్ష్యం చేరుకోవచ్చు

- ట్రాఫిక్ ఎస్సై రమేశ్



మాట్లాడుతున్న ట్రాఫిక్ ఎస్సై అల్లం రమేశ్

సిరిసిల్ల: పట్టుదలగా చదివితే లక్ష్యం ఎంత పెద్దదైనా సాధించవచ్చని, సెల్‌ఫోన్లు, టీవీలకు దూరంగా ఉండాలని సిరిసిల్ల పట్టణ ట్రాఫిక్ ఎస్సై అల్లం రమేశ్ పేర్కొన్నారు. జిల్లా బీసీ స్టడీసర్కిల్ ఉద్యోగ నైపుణ్య శిక్షణ కేంద్రంలో శుక్రవారం మోటివేషన్ క్లాస్ నిర్వహించారు. ఆర్‌ఆర్‌బీ, బ్యాంకింగ్, ఎస్‌ఎస్‌సీ కోచింగ్ అభ్యర్థులతో మాట్లాడారు. పోటీప్రపంచంలో చదువుతోనే ఉన్నత స్థితికి చేరుతారన్నారు. బీసీ స్టడీసర్కిల్‌ను వినియోగించుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ జెల్ల వెంకటస్వామి, కోర్స్ కోఆర్డినేటర్ హరీష్, ఫ్యాకల్టీ నాగరాజు, సిబ్బంది సురేష్, దివ్య, ప్రసాద్, మురళి, వనిత పాల్గొన్నారు.

'అయ్యా.. నా భూమి ఇప్పించండి'



వేడుకుంటున్న నందగిరి కమలవ్వ

రుద్రంగి: 'అయ్యా నన్ను బతికుండగానే చంపేశారు. చనిపోయిందని దొంగ సంతకాలు పెట్టి కొందరు దళారులు నా వ్యవసాయ భూమిని కాజేశారు. మళ్లీ నా భూమి నాకు పట్టా చేయించుకుందాం అంటే ఆఫీసుల చుట్టూ తిరగడానికి కూడా చిల్లిగవ్వలేని పేద దాన్ని. నా భూమి నాకు ఇప్పించి నాకు న్యాయం చేయాలి' అని వేడుకుంటున్న ఈ వృద్ధురాలి పేరు నందగిరి కమలవ్వ. రుద్రంగికి చెందిన ఈ వృద్ధురాలికి సర్వే నంబర్ 176/51లో ఒక ఎకరం భూమి వారి తాత, ముత్తాతల నాటి నుంచి సంక్రమించింది. అట్టి భూమిపై ఇటీవల కొందరు దళారులు కన్నేశారు. కమలవ్వ గతంలోనే భూమి అమ్మినట్టు దొంగ అమ్మకపు పత్రం సృష్టించారు. ఆమె బతికి ఉండగానే చనిపోయిందని దొంగ సంతకాలు పెట్టి అధికారులను నమ్మించి మోసం చేసి ఆమె భూమిలో నుంచి 22గుంటల భూమిని దళారుల పేరుపై ఎక్కించుకున్నారని వాపోయింది. అధికారులు ప్రజాప్రతినిధులు స్పందించి తనకు న్యాయం చేయాలని వేడుకుంటోంది. ఈ విషయంపై రుద్రంగి తహసీల్దార్ శ్రీలతను వివరణ కోరగా ముందు అధికారులు పట్టా చేసి ఉంటారని, తాము ఎలాంటి అక్రమ పట్టాలు చేయలేదన్నారు. బాధితురాలు దరఖాస్తు చేసుకుంటే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

అసెంబ్లీ నిర్ణయం చారిత్రాత్మకం



హర్షం వ్యక్తం చేస్తున్న నాయకులు

కోనరావుపేట: కాంగ్రెస్ ప్రభుత్వం గోర్‌బోలి (లంబాడా) భాషను భారత రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్‌లో చేర్చాలని ఏకగ్రీవ తీర్మానం చేసి కేంద్రానికి పంపడం హర్షణీయమని బానోత్ నరేశ్‌నాయక్ అన్నారు. మండల కేంద్రంలో లంబాడీ బంజారాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. దేశంలో 15 కోట్లు, రాష్ట్రంలో సుమారు 40 లక్షల జనాభా ఉన్నారన్నారు. భాషను షెడ్యూల్‌లో చేర్చడం వల్ల గిరిజన సంస్కృతి, సాంప్రదాయాల రక్షణతోపాటు వేల మందికి ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయన్నారు. గిరిజన గోర్‌బోలి భాషను షెడ్యూల్‌లో చేర్చకుండా విస్మరించారని, ఇప్పటికైనా కేంద్రమంత్రులు బండి సంజయ్, కిషన్‌రెడ్డి పార్లమెంట్‌లో బిల్లు పాస్ అయ్యే విధంగా చూడాలన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ వాల్యా నాయక్, నాయకులు రాజు నాయక్, కిషన్ నాయక్, పంతుల్ నాయక్ , ప్రకాశ్ నాయక్, రాజు బల్కర్, తిరుపతి, రమేశ్, మదన్ నాయక్, మోహన్, అమృతలాల్, పరింగినాయక్ పాల్గొన్నారు.

పాదయాత్రల్లో కాంగ్రెస్ శ్రేణులు పాల్గొనాలి



మాట్లాడుతున్న బొడ్డు రాములు

బోయినపల్లి: ఏఐసీసీ పిలుపు మేరకు మండలంలోని అన్ని గ్రామాల్లో ఏప్రిల్ 2వ తేదీ నుంచి జరిగే జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ పాదయాత్రల్లో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కార్యక్రమ మండల కో ఆర్డినేటర్ బొడ్డు రాములు కోరారు. మండల కేంద్రంలో శుక్రవారం కార్యకర్తల సన్నాహక సమావేశంలో మాట్లాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు కూస రవీందర్, మండల అధ్యక్షుడు వన్నెల రమణారెడ్డి, సెస్ డైరెక్టర్ కొట్టెపల్లి సుధాకర్, ఏఎంసీ చైర్మన్ బోయిని ఎల్లేశ్‌యాదవ్, వైస్ చైర్మన్ నిమ్మ వినోద్‌రెడ్డి, జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి జంగం అంజయ్య, సంబ లక్ష్మీరాజం, ఏనుగుల కనుకయ్య, అనిల్ కుమార్, బొలుమాల శంకర్ ఉన్నారు.

సతాయిస్తున్న సర్వర్

- పది రోజులుగా సర్టిఫికెట్ల కోసం తండ్లాట



బోయినపల్లి తహసీల్ ఆఫీస్‌లో పేరుకుపోయిన దరఖాస్తులు

బోయినపల్లి(చొప్పదండి): బోయినపల్లి తహసీల్దార్ ఆఫీస్‌లో పలు రకాల సర్టిఫికెట్ల కోసం దరఖాస్తుదారులు ఇబ్బంది పడుతున్నారు. సర్వర్ ఎర్రర్‌తో సర్టిఫికెట్ల మంజూరులో జాప్యమవుతోంది. ఈనెల 17 నుంచి సర్వర్‌డౌన్ పేరుతో సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని దరఖాస్తుదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రద్దీ భరించలేక దరఖాస్తులు రిజిస్టర్‌లో ఎంట్రీ చేసే గదికి రెవెన్యూ సిబ్బంది తాళం వేశారు. సుమారు వేయికి పైగా దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని సమాచారం. తహసీల్దార్ నారాయణరెడ్డిని వివరణ కోరగా.. సర్టిఫికెట్లు జారీ చేస్తున్నామని, ఒకేసారి వందల కొలది దరఖాస్తులు రావడంతో కొంత జాప్యమవుతోందని తెలిపారు.

రాత్రివేళ.. పీహెచ్‌సీలో అందని వైద్యం

- తేలు కుట్టడంతో ఆస్పత్రికి వెళ్లిన బాధితుడు
- తలుపు తీయని సిబ్బంది
- 108లో సిరిసిల్లకు తరలింపు



అంబులెన్స్‌లో సిరిసిల్లకు వెళ్తున్న బాధితుడు

కోనరావుపేట(వేములవాడ): రాత్రి వేళ ఆపదలో వస్తే బాధితులకు వైద్యసేవలు అందడం లేదు. మండల కేంద్రానికి చెందిన పని గంగారాంకు గురువారం రాత్రి 10 గంటల సమయంలో తేలు కుట్టింది. వెంటనే మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లగా తలుపులు మూసి ఉన్నాయి. ఎంత పిలిచినా సిబ్బంది బయటకు రాకపోవడంతో.. నొప్పి తీవ్రమైంది. దీంతో 108 అంబులెన్స్‌లో సిరిసిల్లలోని జిల్లా ఆస్పత్రికి వెళ్లి చికిత్స చేయించుకున్నాడు. ఈ విషయమై వైద్యాధికారి వేణుమాధవ్‌ను వివరణ కోరగా రాత్రి వేళ మద్యం సేవించి వచ్చి విధులకు ఆటంకం కలిగిస్తున్నారన్నారు. గురువారం రాత్రి కూడా కొందరు మద్యం సేవించి వచ్చారని, వారిని వెళ్లగొట్టి తలుపులు పెట్టుకున్నట్లు తెలిపారు. మళ్లీ తలుపులు తడితే వారే కావచ్చు అని భ్రమపడ్డట్లు చెప్పారు. విధులపై నిర్లక్ష్యం వహించిన ఏఎన్‌ఎంకు మెమో జారీ చేశామన్నారు. ఆస్పత్రిలో 24 గంటలు వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు.

మీడియా కమిషన్ ఏర్పాటు చేయండి

- జర్నలిస్టుల సమస్యలను తక్షణం పరిష్కరించాలి
- టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య



నూతన కమిటీతో టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు

వేములవాడ: రాష్ట్రంలో జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారంతోపాటు మీడియాలో వస్తున్న అనారోగ్యకర భాష నియంత్రణకు మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలని కోరారు. పట్టణంలోని మున్నూరుకాపు సంఘం భవన్‌లో టీడబ్ల్యూజేఎఫ్ వేములవాడ నియోజకవర్గం మహాసభ శుక్రవారం జరిగింది. ఐఎఫ్ డబ్ల్యూజే కార్యదర్శి పులిపలుపుల ఆనందం, ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండి విజయ్‌కుమార్, కరీంనగర్ జిల్లా కార్యదర్శి కుడితాడు బాపురావు, జిల్లా అధ్యక్షుడు పెరుక రవి, నేషనల్ కౌన్సిల్ మెంబర్ యూసుఫ్ తదితరులు పాల్గొన్నారు. వేములవాడ నియోజకవర్గం జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని కోరుతూ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు వినతిపత్రం ఇవ్వాలని తీర్మానించారు.

వేములవాడ నియోజకవర్గ కమిటీ

తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ వేములవాడ నియోజకవర్గం నూతన కమిటీని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా తొగరి కరుణాకర్, కార్యదర్శిగా సుంకరి నరేందర్, కోశాధికారిగా బొప్ప భిక్షపతి, ఉపాధ్యక్షులుగా అవధూత శ్రీధర్, కవ్వాల సురేందర్, ఎండీ షరీఫ్, సహాయ కార్యదర్శులుగా గొల్లపల్లి వేణు, కోటగిరి రాజశేఖర్, గోపు ప్రవీణ్, కార్యవర్గ సభ్యులుగా చల్లా రమేశ్, వాసం వెంకటస్వామి, ఎగుమంటి మూర్తిరెడ్డి, కళ్యాడపు వెంకటమల్లు, చక్రహరి దేవేందర్‌రాజు, మహమ్మద్ అబ్దుల్ రఫీక్, నడిగట్ల భిక్షపతి, సయ్యద్ షబ్బీర్‌లను ఎన్నుకున్నారు.

రైస్‌మిల్లుల్లో టాస్క్‌ఫోర్స్ అధికారుల సోదాలు



సోదాలు చేస్తున్న అధికారులు

మంథని: సూరయ్యపల్లి రైస్‌మిల్లులో పౌర సరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్, టాస్క్‌ఫోర్స్ అధికారులు శుక్రవారం సోదాలు నిర్వహించారు. 2022–23 సీఎమ్మార్ ప్రకారం ధాన్యం నిల్వలపై అనుమానాల్లో భాగంగా సూరయ్యపల్లి రైస్‌మిల్లులో అధికారులు తనిఖీలు చేశారు. మిల్లులో 41,365 క్వింటాళ్ల ఉండాల్సి స్థానంలో ధాన్యం లేదని గుర్తించారు. కాగా, తాను లీజు తీసుకున్న గంగాపురి సమీపంలో ధాన్యం నిల్వ ఉందని యజమాని చెప్పడంతో అధికారులు అక్కడకు వెళ్లి పరిశీలించారు. అక్కడ 9,689.08 క్వింటాళ్ల ధాన్యం నిల్వ మాత్రమే ఉన్నట్లు అధికారులు గుర్తించారు. మిగతా ధాన్యం నిల్వలు అందుబాటులో లేవని తేల్చారు. నిర్దేశించిన ప్రకారం ప్రభుత్వానికి చెల్లింపులు చేయాల్సి ఉంటుందని, కానీ, అలా చేయక పోవడంతో సోదాల్లో వెలుగుచూసిన అంశాలను కమిషనర్‌కు నివేదిస్తామని స్పెషల్ ఆఫీసర్ లక్ష్మారెడ్డి తెలిపారు. రూ.కోట్ల విలువైన ధాన్యం అందుబాటులో లేకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై పౌర సరఫరాల శాఖ అధికారులు స్పష్టత ఇవ్వాల్సి ఉంది. తనిఖీల్లో ఓఎస్డీ ప్రభాకర్, ఎస్‌ఐ జంగయ్యతో పాటు తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల సంఘం అధ్యక్షుడిగా శ్రీనివాసరావు



బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు

సిరిసిల్లకల్చరల్: సిరిసిల్ల బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులుగా జూపెల్లి శ్రీనివాసరావు, తంగళ్లపెల్లి వెంకటి ఎన్నికయ్యారు. సిరిసిల్లలో శుక్రవారం నిర్వహించిన ఎన్నికల ఫలితాలను ఎన్నికల నిర్వహణాధికారి సురభి సత్యనారాయణరావు ప్రకటించారు. అధ్యక్ష స్థానానికి పోటీపడ్డ రమణారెడ్డికి 56 ఓట్లు, ఆవునూరి రమాకాంత్‌రావుకు 41 ఓట్లు వచ్చాయి. త్రిముఖ పోటీ జరుగగా.. చివరికి శ్రీనివాసరావు తన సమీప ప్రత్యర్థి రమణారెడ్డిపై 23 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. కార్యదర్శి స్థానానికి పోటీచేసిన జవ్వాజి ప్రసాద్‌కు 60 ఓట్లు రాగా 54 ఓట్ల మెజారిటీతో తంగళ్లపెల్లి వెంకటి గెలుపొందారు. వెంకటి వరుసగా రెండో సారి కార్యదర్శిగా గెలుపొందడం. ఉపాధ్యక్షుడిగా ఎస్.అనిల్ కుమార్ ఏకగ్రీవమయ్యారు. సంయుక్త కార్యదర్శిగా గాజుల రాజమల్లు, కోశాధికారిగా వేముల నరేశ్, మహిళా ప్రతినిధిగా మంద పుష్పలత ఎంపికయ్యారు. నూతనంగా ఎన్నికైన ప్రతినిధులకు సహచర న్యాయవాదులు అభినందనలు తెలిపారు.

జీఎస్టీపై జరిమానా, వడ్డీ రాయితీ

- సెంట్రల్ జీఎస్టీ కమిషనర్ సందీప్‌ప్రకాశ్

సిరిసిల్ల: జీఎస్టీ అమలులోకి వచ్చిన తొలి మూడేళ్లలో పన్ను చెల్లించని వారు ఈనెల 31లోగా చెల్లిస్తే జరిమానా, వడ్డీ రాయితీ వర్తిస్తుందని సెంట్రల్ జీఎస్టీ, కస్టమ్స్ ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ సందీప్ ప్రకాశ్, స్టేట్ జీఎస్టీ కమిషనర్ హరిత శుక్రవారం సంయుక్త ప్రకటనలో తెలిపారు. 2017–2018, 2018–2019, 2019–2020 సంవత్సరాలకు మదింపు చేసిన పన్ను మొత్తం చెల్లిస్తే.. దానిపై వేసిన జరిమానా, వడ్డీలను మాఫీ చేస్తారని వివరించారు. మార్చి 31లోగా పన్నులు చెల్లించి, జూన్ 30లోగా జీఎస్టీ పోర్టల్‌లో దరఖాస్తులను సమర్పించాలని కోరారు.



రాజన్నను దర్శించుకుంటున్న భక్తులు

కోడె మొక్కులు... కుంకుమ పూజలు

వేములవాడ: రాజన్నను శుక్రవారం 15 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. ధర్మగుండంలో పుణ్యస్నానాలు చేసిన అనంతరం కోడెమొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల ద్వారా రూ.25 లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికారులు తెలిపారు.



కోడె మొక్కు చెల్లించుకుంటున్న భక్తులు